ఆ రోజులు.. మళ్లీ రావు..

పూర్వ విద్యార్థుల జ్ఞాపకాల పరిమళం

కాలం ఎంత వేగంగా పరుగులు తీసినా బాల్య స్మృతులు మాత్రం మనల్ని పలకరిస్తూనే ఉంటాయి. ఎంత ఉన్నత స్థానాల్లో స్థిరపడినా, చిన్ననాటి స్నేహం ఎప్పటికీ మధుర జ్ఞాపకమే. ఆ మిత్రులందరినీ ఒకేసారి కలుసుకుంటే ఆ ఆనందమే వేరు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో అప్పుడప్పుడూ కలుస్తూనే ఉన్నా.. ఒక బ్యాచ్ విద్యార్థులను మాత్రమే కలుస్తారు. కానీ పాఠశాల శతాబ్ది వేడుకలు కావడంతో దాదాపు 50 నుంచి 60 బ్యాచ్‌లకు చెందిన వందలాది మంది విద్యార్థులు కలిసే అవకాశం రావడంతో వారంతా ఎంతో ఉత్సాహంగా కనిపించారు. రెండు రోజుల పాటు జరుగుతున్న భీమిలి ఉన్నత పాఠశాల శతాబ్ది వేడుకల్లో మొదటి రోజు పాల్గొన్న మిత్రబృందం 'ఆ రోజులు .. మళ్లీ రావు' అంటూ గుర్తు చేసుకున్నారిలా..

- భీమునిపట్నం



ఆనందంతో డ్యాన్స్ చేస్తున్న పూర్వ విద్యార్థులు

ఆ రోజులు కళ్ల ముందే కదలాడుతున్నాయి



నేను ఈ పాఠశాలలో 1992–94 సంవత్సరాల్లో 8వ తరగతి నుంచి టెన్త్ వరకు చదువుకున్నాను. ఇప్పుడు పాఠశాలను చూడగానే ఆ జ్ఞాపకాలన్నీ కళ్ల ముందే కదలాడుతున్నాయి. చదువులో సహ విద్యార్థులతో పోటీ, ఖాళీ పీరియడ్‌లలో, స్కూల్ అవగానే అందరం కలిసి ఆడుకున్న ఆటలు గుర్తొస్తున్నాయి. మాకు మంచి ఉపాధ్యాయులతో పాటు స్నేహితులు కూడా ఉండడంతో చదువు చాలా బాగా సాగింది. అందర్నీ ఒకసారి కలవాలనే ఉద్దేశంతోనే పని ఒత్తిడి ఎంత ఉన్నా ముందు రోజే వచ్చేశాను. అందరినీ కలవడం ఆనందంగా ఉంది. రేపు మరింతమంది విద్యార్థులు వస్తారు. వారికోసం ఎదురు చూస్తున్నాం.

- క్రాంతికుమార్, ఐజీ జార్ఖండ్ రాష్ట్రం

మా స్కూల్ ఎంతో ప్రత్యేకం



నేను 1979–81లో ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకున్నా. తర్వాత కాలేజీ, యూనివర్సిటీల్లో చదువుకున్నా ఈ పాఠశాల మాత్రం నాకు ఎంతో ప్రత్యేకం. మా ఉపాధ్యాయుల చక్కని బోధన వల్ల పటిష్టమైన పునాది పడింది. దానివల్లే బాగా చదవగలిగాం. ఈ స్థాయికి చేరుకున్నామంటే అప్పటి మా గురువుల దయే ఇదంతా. ఇక మా మిత్రులందరినీ కలుస్తున్నామన్న ఉత్సాహంతో ఈ రోజు ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎదురుచూశాను. అందరినీ కలవడం ఎంతో ఆనందంగా ఉంది.

- వి.ఎం.మహీధర్, ఇన్‌కంట్యాక్స్ అడిషనల్ కమిషనర్, హైదరాబాద్

ఎన్నో ఏళ్ల తరువాత వచ్చాను



ఈ పాఠశాలలో 1961–62 సంవత్సరంలో ఆరో తరగతి చదివాను. నేను 2011లో సబ్ ట్రెజరీ అధికారిగా రిటైర్ అయ్యాను. 62 సంవత్సరాల తరువాత మళ్లీ ఇప్పుడే ఈ కార్యక్రమం కోసం ఇక్కడికి వచ్చాను. ఇది నాకు ఎంతో గొప్పగా ఉంది. పాఠశాలతో పాటు ఊరు కూడా బాగా మారిపోయింది. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే నాతో అప్పుడు చదివిన అయిదుగురిని ఇప్పుడు కలుసుకున్నాను. ఇది ఎంతో అద్భుతమైన విషయం.

- గారపాటి విశ్వనాథం, రాజమండ్రి

సైన్స్, లెక్కల టీచర్లంటే ఎంతో భయం



నేను 1975–78 సంవత్సరాల్లో పాఠశాలలో చదువుకున్నాను. మాకు అప్పట్లో ఉపాధ్యాయులంటే చాలా భయం ఉండేది. ఎంతో గౌరవించేవాళ్లం. శ్రీమంతుడు, భగ్గాం మాస్టర్లు సైన్స్, లెక్కలు చాలా బాగా చెప్పడంతో పాటు ఎంతో నిక్కచ్చిగా ఉండేవారు. మిగిలిన ఉపాధ్యాయులు కూడా బాగా ఉండేవారు. అందుకే చదువు బాగా వచ్చింది.

- డాక్టర్ వి.ఎస్.ఎస్.ఆర్.గుప్తా, రాజమండ్రి





శతాబ్ది వేడుకల్లో పాల్గొన్న 1983-86 బ్యాచ్, 1982-85 బ్యాచ్ విద్యార్థులు

బాగా ఆడుకునే వాళ్లం



1974 నుంచి 1977 వరకు పాఠశాలలో చదువుకున్నా. ఆటలంటే చాలా ఇష్టం. మా ఫ్రెండ్స్‌తో బీచ్ ఇసుకలో వాలీబాల్, కబడ్డీ రోజూ ఆడుకునే వాళ్లం. ఇదే సందర్భంగా పోటీలు జరుగుండడంతో పాటు కొన్ని సార్లు గొడవలు కూడా జరిగేవి. ఇప్పుడు అవన్నీ మధుర స్మృతులుగా మిగిలాయి. మా బ్యాచ్‌లో చాలామందిని ఈ వేడుకల సందర్భంగా కలవగలిగాను.

- డి.సీతారామయ్య, భీమిలి

అందరినీ కలవాలని ఇంగ్లండ్ నుంచి వచ్చాను



నేను 1985–88 మధ్య ఈ స్కూల్లో చదువుకున్నాను. తరువాత ఇతర ప్రాంతాల్లో చదువు అయిపోయిన తరువాత ఇంగ్లండ్ వెళ్లి ఉద్యోగంలో స్థిరపడ్డాను. పాఠశాల శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయని తెలిసి ఎంతో ఆనందం అనిపించింది. ఇక్కడికి రావడానికి చాలా కష్టపడవలసి వచ్చింది. కానీ ఎలాగైనా రావాలనే పట్టుదలతో వీలు చూసుకుని వచ్చాను. ఇక్కడికి వచ్చాక అందర్నీ చూశాక ఎంత ఆనందం కలిగిందో మాటల్లో చెప్పలేను. పాత రోజులన్నీ గుర్తొస్తున్నాయి.

- వి.రాంగోపాల్, ఇంగ్లండ్

ఎంతోమంది స్నేహితులు కలిశారు



నేను 1979–83 వరకు 8వ తరగతి నుంచి టెన్త్ వరకు చదివాను. బ్యాంక్ జాబ్ చేస్తున్నాను. తరువాత వేరే ప్రాంతాలను వెళ్లినా వీలున్నప్పుడు ఇక్కడికి వచ్చి వెళ్తుంటాను. ఇప్పుడు ఉత్సవాలు జరుగుతున్నాయని తెలిసి వచ్చేశాను. ఇక్కడ చాలా మంది స్నేహితులను కలిసే అవకాశం కలిగింది. ఎంతో సంతోషంగా ఉంది.

- మాధవరాం, నాగ్‌పూర్

ఇది మరపురాని అనుభూతి



నేను 1990–93 సంవత్సరాల్లో ఇక్కడ చదువుకున్నాను. తరువాత ఇతర ప్రాంతాల్లో చదివాను. ఇప్పుడు టాటా పవర్ సోలార్ కంపెనీలో చేస్తున్నాను. 30 సంవత్సరాల తరువాత మళ్లీ ఇక్కడికి వచ్చాను. మా పాఠశాల వందేళ్ల ఉత్సవాలంటే ఎంతో ఆనందంగా ఉంది. ఈ కార్యక్రమానికి వస్తానని అనుకోలేదు. నమ్మలేకపోతున్నాను. ఇది నాకు గొప్ప అనుభూతి.

- బుల్లా విజయకుమార్, తిరునల్వేలి, తమిళనాడు

క్లుప్తంగా

పీఏసీఎస్ రిటైర్డ్ సీఈవోకు సన్మానం



రిటైర్డ్ సీఈవో ఆంజనేయులను సన్మానిస్తున్న పీఏసీఎస్ ఉద్యోగులు

పద్మనాభం: మండలంలోని బాందేవుపురం కో–ఆపరేటివ్ (పీఏసీఎస్) సొసైటీ రిటైర్డ్ సీఈవో ఎల్ఏఆర్ ఆంజనేయులను పద్మనాభంలోని డీసీసీబీ బ్రాంచ్‌లో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ బి.వెంకట అప్పారావు మాట్లాడుతూ ఆంజనేయులు పీఏసీఎస్‌లో 38 ఏళ్ల సేవలు అందించారన్నారు. కార్యదర్శిగా, సీఈవోగా ఆయన అందించిన సేవలు మరువలేమని అన్నారు. కార్యక్రమంలో పర్సన్ ఇన్‌చార్జిలు బడే శ్రీను, కేఎస్‌వీజీ ప్రసాద్, పద్మనాభం డీసీసీబీ బ్రాంచ్ పరిధిలోని కో–ఆపరేటివ్ సొసైటీల సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



పెద్దిపాలెంలో సత్యనారాయణమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చిన్న శ్రీను

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు రామసత్యం, ఎంపీటీసీ సభ్యుడు మరుపిళ్ల చిన్నయ పాత్రుడిని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. రామసత్యం భార్య మరుపిళ్ల సత్యనారాయణమ్మ గత నెల 24న హఠాన్మరణం చెందడంతో, వారిని పరామర్శించి, ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట సుంకర గిరిబాబు, దంతులూరి వాసురాజు, కంటుబోతు రాంబాబు, మజ్జి వెంకటరావు, బంక సత్యం, బోని అప్పలనాయుడు, గాడు శ్రీను తదితరులు ఉన్నారు.

ప్రత్యేక పరీక్షలతో మానసిక వికాసం

సబ్బవరం: విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య పరిస్థితులు మెరుగుపరిచేందుకు ప్రత్యేక పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని భీమిలి డైట్ అధ్యాపకుడు సారిపల్లి త్రినాథరావు అన్నారు. సబ్బవరం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఏ స్టడీ ఆఫ్ మెంటల్ హెల్త్.. అకడమిక్ ఎచీవ్‌మెంట్ ఆఫ్ సెకండరీ స్కూల్ ఇన్ ఆంధ్రప్రదేశ్‌పై పరీక్షలను శనివారం ఉదయం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 33 ప్రశ్నలతో కూడిన ఈ పరీక్ష విద్యార్థుల్లో మానసిక వికాసానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని పి.రాధాకుమారి పాల్గొన్నారు.

వృద్ధుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్

ఏయూక్యాంపస్ : ఏడు పదుల వయసులో ఆ పెద్దాయనకు ఏం కష్టమొచ్చిందో.. జీవితాన్ని వదిలి తీరని లోకాలకు వెళ్లిపోదామనుకున్నాడు..జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ సకాలంలో స్పందించి ఆ వృద్ధుడ్ని కాపాడారు. వివరాల్లోకి వెళ్తే..నగరంలోని ఎస్‌పీడీ ప్రాంతానికి చెందిన నున్నా చిట్టిబాబు (72) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులకు భారం కాకూడదని తనువు చాలించాలనుకున్నాడు. మత్స్యదర్శిని సమీపాన ఆర్కేబీచ్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ ఆనంద్, ధనరాజ్, అరవింద్, పోలిరాజులు బీచ్‌లో కొట్టుకుపోతున్న ఆ వృద్ధుడ్ని కాపాడారు. అనంతరం పోలీసుల సాయంతో అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. చిట్టిబాబు ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు.

ప్రజాభిప్రాయాన్ని గౌరవించడం పాలకుల ధర్మం

- శ్రీరాముడి పట్టాభిషేక సమయంలో ఆచరించిన దశరథుడు
- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



రామయంత్రానికి పూజలు చేస్తున్న చాగంటి

మధురవాడ: పాలకులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా ప్రజాభిప్రాయానికి గౌరవం ఇవ్వడమే నిజమైన ప్రజాస్వామ్యం అని, అది రామాయణంలో ఎంతో గొప్పగా వివరించారని ప్రవచన పరమేష్ఠి డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో జరుగుతున్న సంపూర్ణ రామాయణ ప్రవచనాల్లో భాగంగా 8వ రోజు ఆయన అయోధ్యకాండలో పలు ఘట్టాలను వివరించారు. సీతారామ కల్యాణం అనంతరం శ్రీరామునికి యువరాజ పట్టాభిషేకం చేద్దామనుకున్న దశరథ మహారాజు తాను రాజైనప్పటికీ ఏకపక్ష నిర్ణయం చేయకుండా ప్రజాభిప్రాయాన్ని అడిగారని తెలిపారు. అప్పుడు ప్రజలు, భూమి, రుషులు అందరూ శ్రీరాముని యువరాజును చేయమని చెప్పడం అయనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలియజేశారు. తాను ఇన్ని వేల సంవత్సరాలు పాలనచేసిన తర్వాత శ్రీరాముడినే ఎందుకు యువరాజుగా కోరుకుంటున్నారని అడిగితే ప్రజలు రాముని యొక్క గుణములను కీర్తించి, ప్రజలందరినీ తల్లిలా ప్రేమిస్తాడని, తండ్రిలా కాపాడతారని చెప్పారన్నారు. రజోగుణ సంపన్నురాలైన కైకమ్మ అసూయాపూరితమైన మంథర మాటలచే ప్రభావితమైందని, అసూయ అందరూ పరిత్యజించాల్సిన చెడ్డ అలవాటని తెలిపారు. ప్రవచనానికి అనేక మంది విద్యార్థులు హాజరయ్యారు. చాగంటి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి మానసిక దర్శనాన్ని వివరించగా, సభికులు తిరుమల దర్శనం చేసుకున్న సంతృప్తిని పొందారు. ప్రవచన కార్యక్రమానికి ముందు రామయంత్రానికి పూజలు చేశారు. నిర్వాహకులు అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణమూర్తి దంపతులు, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

పరాజయమే విజయానికి సోపానం

- అలాంటి వారి జీవితాలే పాఠాలు
- ఐఐఎంవీ ఈ–సమ్మిట్‌లో వక్తలు



సమ్మిట్‌లో జరుగుతున్న చర్చలో పాల్గొన్న ప్రముఖులు

తగరపువలస: పరాజయాలను సోపానాలుగా చేసిన విజయం సాధించిన వ్యవస్థాపకుల జీవితాలను పాఠాలుగా నేర్చుకోవాలని టాక్సీ ఫోర్ ష్యూర్‌కు చెందిన అప్రమేయ రాధాకృష్ణ, ఫ్యాబ్ మార్ట్ అండ్ ఇండియా ప్లాజా వ్యవస్థాపకుడు కె.వైతీశ్వరన్ అన్నారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీలో శనివారం జరిగిన ఇన్నోవేటర్లు, వ్యవస్థాపకులు, స్టార్టప్‌ల కలయికలో జరిగిన పరివర్తనాత్మక ఈ–సమ్మిట్‌లో వారు మాట్లాడారు. ప్రొఫెసర్ షమీమ్ జావేద్ ప్రారంభోత్సవ ప్రసంగం చేశారు. కీలకమైన వాటాదారుల మధ్య సహకారం, నేర్చుకోవడం, నెట్‌వర్కింగ్‌ను పెంపొందించుకోవడం ద్వారా స్ఫూర్తిదాయకంగా ఈవెంట్ ప్రారంభమైనట్లు తెలిపారు. పీర్ క్యాపిటల్ మేనేజింగ్ పార్టనర్ కార్తీక్ ప్రభాకర్ క్రాఫ్టింగ్, నేరేటివ్స్, స్టోరీ టెల్లింగ్స్ టు బిల్డ్ స్టార్టప్ బ్రాండ్స్ అనే అంశాలపై కీలక ఉపన్యాసం చేశారు. ఒక వెంచర్ ప్రారంభించేటప్పుడు స్పష్టమైన ఉద్దేశం కలిగి ఉండవలసిన ప్రాముఖ్యత గురించి వివరించారు. ఏపీవాల్ట్ 2.0లో దేశవ్యాప్తంగా పాల్గొన్న 50కు పైగా జట్ల నుంచి ముగ్గురిని విజేతలుగా ప్రకటించారు. ఈ సమ్మిట్‌లో స్టార్టప్ వ్యవస్థాపకులు, ఎంఎస్ వ్యవస్థాపకులు, ప్రతినిధులు 500 మందికి పైగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సూనీకార్న్ వెంచర్స్ సహ వ్యవస్థాపకుడు విజయసింగ్ రాథోడ్, ఎండ్యూరెన్స్ క్యాపిటల్ మేనేజింగ్ పార్టనర్ సిద్ధార్థ సిరిగెరి, ఐఐఎంవీ ఫీల్డ్ సీఈవో గుహేష్ రామనాథన్ తదితరులు మాట్లాడారు.

జీవన శైలిలో మార్పులే ఒత్తిడికి మూలం

విశాఖ విద్య: జీవనశైలిలోని మార్పులే ఒత్తిడికి మూలమని సాంకేతిక విద్య విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సాయి లక్ష్మి పేర్కొన్నారు. ఆంధ్రాయూనివర్సిటీ లోని సోషల్ వర్క్ విభాగంలో శనివారం 'మానవ జీవన శైలి – సోషల్ వర్కర్ పాత్ర ' అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో అనేక రుగ్మతలకు జీవన శైలే ప్రధాన కారణమన్నారు. విద్యార్థులు ఒత్తిడి లేని చదువులకు అలవాటు పడాలన్నారు. అధ్యాపకులు డాక్టర్ అబ్రహం, పుష్పలత పాల్గొన్నారు.

మోసం చేస్తున్న ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మాల మహానాడు వ్యవస్థాపకుడు భాగం గోపాలరావు

తగరపువలస: వినియోగదారులను వాయిదాల పేరుతో మోసం చేసి, వేధించి చివరకు ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్న ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలపై ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని మాల మహానాడు వ్యవస్థాపకుడు భాగం గోపాలరావు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడారు. జాతీయ, షెడ్యూల్డ్ బ్యాంకులు సకాలంలో ప్రజలకు సక్రమంగా రుణాలు మంజూరు చేయకపోడంతో ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల కోరల్లో చిక్కుకుని వినియోగదారులు విలవిలలాడుతున్నారన్నారు. ఒక్కోసారి రికవరీ ఏజెంట్లు కూడా సంస్థకు డబ్బులు చెల్లించకుండా ఉడాయిస్తే వినియోగదారులే బాధ్యులుగా మిగిలిపోతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వాలు వినియోగదారులకు రక్షణగా ఉండాలన్నారు. సమావేశంలో మాల మహానాడు ప్రతినిధులు బోని సన్నిబాబు, మామిడి శివ, కొట్యాడ వీర ఈశ్వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డులో భారీ వాహనాలతో ట్రాఫిక్ ఇక్కట్లు



కారుషెడ్ కూడలి నుంచి కొమ్మాది వైపునకు వెళ్లే సర్వీసు రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

పీఎం పాలెం: సర్వీస్ రోడ్లలో భారీ వాహనాలు ప్రవేశించడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. శనివారం సాయంత్రం ఇదే పరిస్థితి ఏర్పడింది. కారుషెడ్ కూడలి నుంచి కొమ్మాది వైపునకు వెళ్లే సర్వీస్ రోడ్డులో భారీ వాహనం ప్రవేశించడంతో పీఎం పాలెం ఆఖరు బస్టాప్‌నకు వెళ్లే రోడ్డులో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలు సర్వీస్ రోడ్డులో ప్రయాణిస్తే కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఎస్ఐ విజయ్ హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం

అందరినీ పేరుపేరునా పలకరించిన పార్టీ సమన్వయకర్త చిన్న శ్రీను



నాయకులు, కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పార్టీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆనందపురం మండలం వేములవలసలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు ఇంటి వద్ద వారిని కలిసిన ఆయన అక్కడికి వచ్చిన నాయకులు, కార్యకర్తలను పేరుపేరునా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ పంచాయతీల నుంచి వచ్చిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు చిన్నశ్రీనును ఘనంగా సన్మానించి, మండలంలో వైఎస్సార్‌సీపీ ఐకమత్యాన్ని, బలాన్ని చాటిచెప్పారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీలు దంతులూరి వాసురాజు, కంటుబోతు రాంబాబు, పార్టీ మండల అధ్యక్షులు బంక సత్యం, కోరాడ లక్ష్మణ, గాడు శ్రీను, సీనియర్ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు బంటుపల్లి మణిశంకరనాయుడు, మజ్జి వెంకటరావు, బోని అప్పలనాయుడు, పోతిన హనుమంతరావు, పిన్నింటి వెంకటరమణ, గండ్రెడ్డి శ్రీను, లెంక రాంబాబు, చందక సూరిబాబు, బొట్ట రామకృష్ణ, షిణగం దామోదరరావు, చెల్లూరి నగేష్, బోని సన్యాసినాయుడు, కోరాడ అప్పలస్వామి నాయుడు, ఉప్పాడ సూర్రెడ్డి, కోరాడ అప్పలస్వామినాయుడు, రౌతు వెంకటరావు, బలిరెడ్డి మహేష్, ఎస్.చంద్రమౌళి, పడాల రాము, కోల అప్పలస్వామి, కలిమి గంగరాజు, చందక అప్పలస్వామి, చెన్నా సత్యం, ఇల్లిపల్లి నరసింగరావు, పి.సింహాచలంనాయుడు, కోరాడ రాంబాబు, మీసాల పైడిరాజు, నాయుడుబాబు, బంక కృష్ణంనాయుడు, బంక శ్రీను, కూరాకుల వెంకటేష్, షిణగం చిన రామారావు, పొట్నూరు చంద్రశేఖర్, రాంజీ, ముత్యాలనాయుడు, గొర్లె వెంకట అప్పారావు, బంక సూర్యనారాయణ, రౌతు శ్రీను, కోన శ్రీను, పతివాడ గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతి వేగం

- ఒక యువకుడు మృతి
- మరొకరికి గాయాలు



మృతుడు ముమ్మాని ప్రదీప్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సీఐ బొడ్డేపల్లి సుధాకర్ తెలిపిన వివరాలివి.. విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం కొత్యాడ గ్రామానికి చెందిన ముమ్మాని ప్రదీప్, స్నేహితుడు లోకేష్ మూడు సంవత్సరాలుగా చిప్పాడలోని దివీస్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ, కంపెనీ క్వార్టర్స్‌లో ఉంటున్నారు. వారు శుక్రవారం సాయంత్రం వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై వైజాగ్ వెళ్లారు. పనులు ముగించుకుని రాత్రి తిరిగి వస్తుండగా చిప్పాడ వద్ద ఎర్రమట్టిదిబ్బల సమీపంలో మార్లిన్‌కేఫ్ మలుపు వద్ద వారి ద్విచక్ర వాహనం అదుపు తప్పి, బోల్తాపడింది. ఈ ఘటనలో ప్రదీప్ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికుల సహాయంతో హుటాహుటిన కేజీహెచ్‌కు తరలించారు. రక్త స్రావం ఎక్కువ కావడంతో అప్పటికే ప్రదీప్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెనుక కూర్చున్న లోకేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం లోకేష్ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అతి వేగంతో రావడం వలన వాహనం అదుపు తప్పి, ప్రమాదానికి గురైనట్లు పోలీసులు తెలిపారు. ప్రదీప్ తండ్రి రమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీరు వృథా



డ్రైవర్స్ కాలనీలో వృథాగా పోతున్న తాగునీరు

మధురవాడ: కొందరు గృహ యజమానులు నిర్లక్ష్యం, తాగునీటి విభాగం అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వలన తాగునీరు వృథాగా పోతోంది. శనివారం ఉదయం జీవీఎంసీ 5వ వార్డు డ్రైవర్స్ కాలనీ వద్ద వ్యక్తిగత కుళాయిల ట్యాప్‌నకు హెడ్ లేక పోవడం వలన నీరు వృథాగా పోతున్న దృశ్యం కనిపించింది. డ్రమ్ములకు పైపులు పెట్టి వదిలెయ్యడం వలన ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



జాతీయ రహదారిపై బోయిపాలెం వద్ద దట్టంగా పొగ మంచు

• తొలగని మంచుతెర

తెల్లవారినా మంచుతెరలు తొలగడం లేదు. చలి కాస్త తగ్గి, వేడి పెరుగుతూనే ఉన్నా ఉదయం వేళ మాత్రం దట్టంగా మంచు కురుస్తూనే ఉంది. శనివారం ఉదయం 8.30 గంటల వరకు బోయిపాలెం, పరదేశిపాలెం, మారికవలస, మధురవాడ పరిసర ప్రాంతాలలో ఈ పరిస్థితి కనిపించింది. జాతీయరహదారిపై దగ్గరకు వచ్చేవరకు కూడా వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొనడంతో వాహనదారులు లైట్లు వేసుకుని, జాగ్రత్తగా ప్రయాణించాల్సి వచ్చింది. -మధురవాడ



పరదేశిపాలెం సమీపంలో కంబాలకొండ రిజర్వు ఫారెస్ట్ కొండ వద్ద 8 దాటినా తొలగని మంచు